

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

బీఆర్‌ఎస్‌తోనే అన్ని విధాలా అభివృద్ధి సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. 8లో▶



స్థానికులకే కేటాయించాలి

మంఖాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని యాక్షన్ కమిటీ సభ్యులు ధర్నా చేశారు. 8లో▶



రెడ్‌క్రాస్‌తో ప్రయోజనం

రెడ్‌క్రాస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సేవలు అమోఘమని కొనియాడారు. 8లో▶

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఓటర్ల నమోదు ప్రక్రియ

కలెక్టర్ హరీశ్



ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు అభ్యంతరాల స్వీకరణ కోసం ఈ ఏడాది జనవరి నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లతో కూడిన 116 బృందాలు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల సహకారంతో 1,114 అపార్ట్‌మెంట్లలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఫారం-6 దరఖాస్తులు 10,275 వచ్చాయని, ఫారం-8 దరఖాస్తులు 5,495 వచ్చాయని.. వాటిని పరిశీలించి పరిష్కరించినట్లు చెప్పారు. సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన 5,628 ఫారం -6, ఫారం -8 దరఖాస్తులు 1,1659, ఫారం -7 దరఖాస్తులు 6,841 సేకరించాయని వెల్లడించారు. శేరిలింగంపల్లిలో ఒకే ఇంటి నంబర్లు కలిగిన 5,155 మంది ఓటర్లు ఉన్నారని అందిన ఫిర్యాదులపై ఈఆర్‌ఓల స్వీయ పర్యవేక్షణలో బీఎల్‌ఓల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. వారిలో 5,024 మంది ఓటర్లు జాబితాలో ఉన్న చిరునామాల్లోనే నివసిస్తున్నట్లు, ఇంటి నంబర్లు వేర్వేరుగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు సమగ్ర విచారణ కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

అరాచకశక్తులతో అప్రమత్తంగా ఉండాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మహాసభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

హుడాకాంప్లెక్స్: దేశంలో కులాన్ని, మతాన్ని అడ్డుపెట్టుకుని విద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొడుతూ రాజకీయంగా లబ్ధి పొందాలని కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వాటితో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర తొలి మహాసభ ఆదివారం సరూర్‌నగర్ మండల కార్యాలయంలో జరిగింది. ఇస్కఫ్ నేతలు, కార్యకర్తలు కొత్తపేట చౌరస్తా నుంచి సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. కుల, మత మౌఢ్యం లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇస్కఫ్ కృషి చేస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఇస్కఫ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కొన్ని అరాచరక శక్తులతో ప్రజల్లో అభద్రతా వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో అమాయక మహిళలు, యువతులపై లైంగిక దాడులు చేస్తూ, చిత్రహింసలకు పాల్పడుతూ హత్య చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని దుయ్యబట్టారు. ఇలాంటి సమయంలో ప్రజల మధ్య సామరస్య సంబంధాల పెంపునకు, సమైక్యశక్తిని చాటేందుకు, సాంస్కృతిక విధ్వంసాన్ని అడ్డుకునేందుకు ఇస్కాఫ్ నిరంతరం పాటుపడుతోందని కొనియాడారు. సమావేశంలో పార్టీ జాతీయ కార్యదర్శి సభ్యుడు, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ఇస్కఫ్ జాతీయ కార్యదర్శి విజయ పదిహర, రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి టి.విజయకుమారి, కార్యదర్శి అరుణ్‌కుమార్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి నజీంఖాన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, సరూర్‌నగర్ కార్యదర్శి చందునాయక్, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి షైమిదా, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ నోటిఫికేషన్ లేనట్టే!

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కేటగిరీ-2 పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ లేనట్టే అని తెలుస్తోంది. పరిశోధనలకు పర్యవేక్షణ అధ్యాపకుల వద్ద సీట్లు ఖాళీలు లేనందున కేటగిరి-2 నోటిఫికేషన్‌ను నిలిపివేసినట్లు సమాచారం. ఈ నెలతో ముగిసిన 2017 బ్యాచ్ పీహెచ్‌డీ విద్యార్థులకు డిసెంబర్ వరకు గడువు పొడిగించారు. దీంతో డిసెంబర్ తర్వాత ఖాళీలు ఏర్పడితే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

ఉపాధ్యాయ బది'లీలలు'

తప్పుల తడకగా సీనియార్టీ జాబితా

- అడ్డదారుల్లో దరఖాస్తులు
- ఆమోదించిన అధికారులు
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉపాధ్యాయుల బదిలీల సీనియార్టీ జాబితాపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అర్హత లేకపోయినా ఎక్కువ పాయింట్లు పొంది.. ఆశించిన ప్రదేశంలో పోస్టింగ్ పొందాలని భావించిన ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కారు. సీనియార్టీ జాబితాను పరిశీలించాల్సిన క్షేత్రస్థాయి అధికారులు సైతం నిబంధనలను తుంగలో తొక్కి.. పరోక్షంగా వారికి సహకరించినట్లు తెలిసింది. ఇందుకు ఆయా ఉపాధ్యాయుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బదిలీల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఆన్‌లైన్ వేదికగా జరుగుతోందని.. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తుండటం విశేషం.

అనేక అనుమానాలు

జిల్లా వ్యాప్తంగా 1,266 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో 6,413 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా స్కూళ్లలో 5,936 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో 4,722 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి హెడ్మాస్టర్‌గా పదోన్నతి కోసం 166 మంది, ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా కోసం 173 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎనిమిదేళ్లుగా ఒకేచోట పని చేస్తున్న వారు 3,305 మంది వరకు ఉన్నారు. అర్హత గుర్తింపు, రోస్టర్ పాయింట్ల కేటాయింపు, సీనియార్టీ జాబితా రూపొందించే విషయంలో అనేక లోటుపాట్లు, అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన సీనియార్టీ జాబితాపై పలు ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ మేరకు పలువురు ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖకు తమ అభ్యంతరాలను సమర్పించారు. సోమవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగనుంది. జాబితాలో చోటు చేసుకున్న తప్పిదాలను సరిచేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడానికి వెనుకాడబోమని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- బదిలీల్లో కనీసం రెండేళ్లు ఒకే దగ్గర పని చేసిన వారికి అర్హత అనే నిబంధన ఉంది. రేండేళ్ల సర్వీసు పూర్తి కాని మ్యూచ్‌వల్ బదిలీలకు సంబంధించిన 50 మందికిపైగా ఉపాధ్యాయుల దరఖాస్తులు ఆమోదించినట్లు తెలిసింది. వీరికి సర్వీసు కూడా ఎక్కువ నమోదు చేసి పాయింట్లు ఎక్కువ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు తమ ఎనిమిదేళ్ల కాలంలో ఒకేసారి ప్రత్యేక పాయింట్ల (భార్యాభర్తలు, అంగవైకల్యం, అవివాహిత మహిళ, వితంతువులు, అనారోగ్యం)కు సంబంధించినవి వాడుకోవాలనే నిబంధన ఉంది. అనేక మంది ఈ నిబంధనకు తూట్లు పొడిచినట్లు సమాచారం.
- చాలామంది ఎనిమిదేళ్లు పూర్తికాకుండానే ఎక్కువ పాయింట్లు పొందాలని ప్రత్యేక పాయింట్లతో దరఖాస్తులు సమర్పించారు. అధికారులు వారి సర్వీసు పుస్తకాలు పరిశీలించి, దరఖాస్తులను ఆమోదించాల్సిఉన్నా ఇవేవీ పట్టించుకోలేదు.
- వేర్వేరు జిల్లాలు, వేర్వేరు శాఖల్లో పని చేస్తున్న భార్యాభర్తలు సైతం ఇక్కడ ప్రత్యేక పాయింట్లు నమోదు చేసుకోవడం గమనార్హం. క్షేత్రస్థాయి అధికారులు వీరి దరఖాస్తులు పరిశీలించకుండానే జిల్లాకు సమర్పించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- కొంతమంది ఏకంగా పాఠశాల ఒకటో కేటగిరీలో ఉండగా, దరఖాస్తులో మాత్రం మూడో కేటగిరీలో ఉన్నట్లు చూపించి ఎక్కువ పాయింట్లు పొందినట్లు తెలిసింది. ఇలాంటి దరఖాస్తులను కూడా గుడ్డిగా ఎలా ఆమోదించారనేది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.

పారదర్శకత పాటించాలి



ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత పాటించాలని విద్యాశాఖమంత్రి సబితారెడ్డికి పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్ విన్నవించారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం వచ్చిన మంత్రికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చంద్రశేఖర్, ఆనంద్‌కుమార్, హరిప్రసాద్ ఉన్నారు.

టికెట్ కేటాయించండి

- బీజేపీకి దరఖాస్తుల వెల్లువ
- అత్యధికంగా రాజేంద్రనగర్ నుంచి 52 మంది ఆశావహులు



మహేశ్వరం నుంచి అవకాశం ఇవ్వాలని దరఖాస్తు అందజేస్తున్న గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బీజేపీ టికెట్ కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీకి అవకాశం ఇవ్వాలంటూ ఆశావహులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి సగటున పది నుంచి 50 మందికిపైగా దరఖాస్తు చేసుకోవడం విశేషం. వీరిలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, సీనియర్ లీడర్లు ఉన్నారు. అత్యధికంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి 52 దరఖాస్తులు రావడం విశేషం. ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది.

- ఎల్బీనగర్ నుంచి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామరంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు పి.నరేష్ యాదవ్, సీనియర్ నాయకులు కటకం నర్సింగరావు, యశ్పాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.
- శేరిలింగంపల్లి నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్, సీనియర్ నేత గజ్జల యోగానంద్, రాష్ట్ర నాయకుడు కె.నరేష్ దరఖాస్తు చేసుకున్నారు.
- రాజేంద్రనగర్ నుంచి అత్యధికంగా 52 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మైలార్‌దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొక్క బాల్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.మల్లారెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ సహా పలువురు నేతలు దరఖాస్తు చేసుకున్నారు.
- ఇబ్రహీంపట్నం నుంచి ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ పోరెడ్డి సుమతి, ఆమె భర్త బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీ పటేల్‌గూడకు చెందిన మాజీ సర్పంచ్ రాములు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు శాంతికుమార్, నోముల దయానంద్‌గౌడ్, గుర్రం శ్రీనివాసరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.
- చేవెళ్ల నియోజకవర్గం నుంచి శంకర్‌పల్లి మండలం గోపులారం గ్రామానికి చెందిన తొండ రవి సహా మొయినాబాద్‌కు చెందిన కంజర్ల ప్రకాష్, బంటు జ్ఞానేశ్వర్, శంషాబాద్‌కు చెందిన వర్రి తులసీరాం విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నంకు చెందిన కొప్పు భాష, కూకట్‌పల్లికి చెందిన డాక్టర్ సాయి ప్రసాద్, రెడ్డిపల్లికి చెందిన ఎర్రబుచ్చయ్య, నవాబుపేటకు చెందిన సింగాపురం రమేష్ దరఖాస్తు చేసుకున్నారు.
- షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, ఏపీ మిథున్‌రెడ్డి, కక్కునూని వెంకటేశ్‌గుప్తా, దేపల్లి అశోక్ గౌడ్, చెట్ల వెంకటేశ్, ఎంకనోళ్ల వెంకటేశ్, పల్లె ఆనంద్‌గౌడ్, మణికంఠ ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీ పడుతున్న వారిలో ఉన్నారు.
- మహేశ్వరం నియోజకవర్గం నుంచి పది మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. వీరిలో పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు, పాపయ్యగౌడ్, కడారి జంగయ్య యాదవ్, శంకర్‌రెడ్డి, మీర్‌పేట కార్పొరేటర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఉన్నారు.
- కల్వకుర్తి నియోజకవర్గం నుంచి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఒక్కరే దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.

ప్రగతి భవన్‌పై నీలి జెండా ఎగరేస్తాం

బీఎస్పీకి ఒక్క అవకాశం ఇవ్వండి: ప్రవీణ్‌కుమార్



బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

కడ్తాల్: ఎన్నికల్లో ప్రజలు బీఎస్పీకి అవకాశం ఇస్తే తెలంగాణలో బహుజన రాజ్యం స్థాపిస్తామని, ప్రగతి భవన్‌పై నీలి జెండా ఎగురవేస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. బీఎస్పీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ×హలో బహుజన.. చలో కల్వకుర్తి×లో భాగంగా ఆదివారం కడ్తాల్ నుంచి కల్వకుర్తి వరకు చేపట్టిన మెగా బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఎన్నికుట్రలు, కుత్రంతాలు పన్నినా.. ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని బంధుల స్కీంలు పెట్టినా.. ప్రయోజనం లేదన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బీఎస్పీ వైపు చూస్తున్నారన్నారు. ఏ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల్లోని పేదలు రాజ్యాధికారం చేపట్టినప్పుడే పేదల బతుకులు బాగుపడుతాయని ప్రవీణ్ అభిప్రాయపడ్డారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగం, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాగతం

ఆమనగల్లు: రాష్ట్రంలో మెజార్టీగా ఉన్న బహుజనులంతా ఏకమైతే బహుజనులదే రాజ్యాధికారమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. 'హలో బహుజన, చలో కల్వకుర్తి' పేరిట నిర్వహించిన బైక్ ర్యాలీకి ఆయన హాజరయ్యారు. కడ్తాల్‌లో ప్రారంభమైన ర్యాలీ ఆమనగల్లుకు చేరుకోగా పలువురు నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విఠాయిపల్లి వద్ద పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆమనగల్లు పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సంపదను అధికారపార్టీ నేతలు దోచుకుంటున్నారని, బహుజనులు రాజ్యాధికారంలోకి వచ్చిన తరువాత దోచుకున్న సంపదను తీసుకుని అందరికీ పంచుదామని అన్నారు. బీఎస్పీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కల్వకుర్తి ఇన్‌చార్జి కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

చేవెళ్ల: తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ అని, ఆమె పోరాటం భవిష్యత్ తరాలకు ఆదర్శమని రాష్ట్ర గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రజమంలో పాల్గొన్న వారు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరనారి అని కొనియాడారు. అలాంటి మహనీయులు చూపించిన మార్గాలు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, నియోజకవర్గం నాయకులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

సరదా కోసం వచ్చి..

- విగతజీవులుగా మారి..
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



సోనీ (ఫైల్)



ప్రదీప్‌కుమార్ (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

చేవెళ్ల: వారంతా బీటెక్ విద్యార్థులు.. వీకెండ్ కావడంతో సరదాగా గడుపుదామని వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ చూసేందుకు వచ్చారు.. తిరుగు పయనంలో రోడ్డు ప్రమాదం ఇద్దరిని బలితీసుకోగా.. మరో ఇద్దరిని ఆస్పత్రిపాలు చేసింది. ఈ విషాదకర సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు బస్‌స్టేజీ సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కొంపల్లి ప్రాంతంలోని సెయింట్‌మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాలలో చప్పిడి సోని (19), మండవ ప్రదీప్‌కుమార్ (19), అఖిల్, ఆర్యవర్ధన్ బీటెక్ సెకండియర్ పూర్తిచేసుకొని మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. నలుగురు కలిసి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌ను సరదాగా చూసేందుకు కారులో వచ్చారు. రాత్రి అక్కడే బస చేసిన వారు ఆదివారం ఉదయం తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో చేవెళ్ల మండలం ఆలూరు బస్‌స్టేజీ సమీపంలోకి రాగానే అతివేగంగా వస్తున్న వీరి కారు ఒక్కసారిగా అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. కారు వెనుకసీట్లో కూర్చొని ఉన్న సోని, ప్రదీప్‌కుమార్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ముందు సీట్లో ఉన్న అఖిల్, ఆర్యవర్ధన్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు గమనించి అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారులో ఇర్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి అంబులెన్స్‌లో చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. అఖిల్, ఆర్యవర్ధన్‌కు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సరదాగా వెళ్లిన పిల్లలు విగతజీవులుగా మారడం చూసి వారు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల చదువు కోసం..

పిల్లల చదువు కోసమని తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌లోని ఆయా జిల్లాల నుంచి వచ్చి నగరంలో స్థిరపడ్డారు. చప్పిడి సోని తండ్రి మధుసూదన్‌రెడ్డిది కడప జిల్లా. అక్కడ మంచి ఉద్యోగం చేసే ఆయన పిల్లల చదువుకోసమని హైదరాబాద్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో చేరి కర్మాన్‌ఘాట్‌లో నివాసం ఉంటున్నాడు. అన్నింట్లోనూ తమ కూతురు ముందుండేదని ఇలా జరుగుతుందనుకోలేదని బోరున విలపించారు. మండవ ప్రదీప్‌కుమార్ తండ్రి వెంకటశేషయ్యది ప్రకాశం జిల్లా ఒంగోలు. ఒక్కడే కొడుకు కావడంతో అతని చదువుకోసం హైదరాబాద్‌కు వచ్చి కేపీహెచ్‌బీ కాలనీ ధర్మారెడ్డి కాలనీలో ఉంటున్నారు. ఒక్కగానొక్క కుమారుడు బాగా చదివి కుటుంబానికి ఆసరా అవుతాడనుకుంటే అనంతలోకాలకు వెళ్లిపోవటంతో కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. గాయపడిన అఖిల్‌ది అమీన్‌పూర్, సంగారెడ్డి జిల్లా పీవీఆర్‌కాలనీలో ఉంటున్నాడు. తండ్రి కారు తీసుకొని స్నేహితులతో కలిసి అనంతగిరికి వెళ్లారు.

రెడ్‌క్రాస్ సేవలతో ప్రయోజనం


బస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీటీసీ, తదితరులు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: రెడ్‌క్రాస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాలు వచ్చినప్పుడు యుద్ధ ప్రాతిపదికన రెడ్‌క్రాస్ వారు చేస్తున్న సేవలు అమోఘమని ఎమ్మెల్యే కొనియాడారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, శతాబ్ది టౌన్‌షిప్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ వారు వైద్య సహాయార్థం రూ. 60 లక్షలతో పూర్తి వైద్య పరికరాలు అమర్చిన బస్‌ను మంజూరు చేశారు. శనివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డిలు కలిసి బస్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్య నిమిత్తం రెడ్‌క్రాస్ సొసైటీవారు బస్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాగే, ఆరోగ్యవంతులైన యువకులు రక్తాన్ని దానం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహరెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్, శతాబ్ది టౌన్‌షిప్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి , ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహ, మండల కో ఆప్షన్ ఇమ్రాన్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, వెంకట్‌రెడ్డి, విజయ్, శేఖర్, శ్రీశైలంగౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను వెంటనే చేపట్టాలి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా నుంచి శంకరకొండ తండాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. పనుల జాప్యంపై అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మేడిగడ్డతాండా, శంకరకొండతండాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి పనులను ఇంకా ఎందుకు ప్రారంభించలేదని ఆమనగల్లు పీఆర్ డిప్యూటీ ఈఈ తిరుపతిరెడ్డిని ఫోన్‌లో ప్రశ్నించారు. నెలల క్రితం పనులకు శంకుస్థాపన చేసినా ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారు. పనులు ప్రారంభించకపోతే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వెంటనే పనులు ప్రారంభించాలని, వీలైనంత త్వరగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా తండాల ప్రజలు, యువకులు అపోహలు వీడాలని, ఆందోళనలు చేయవద్దని ఆయన సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.

సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

జిల్లా ఎంపీటీసీల సంఘం
గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకని, గ్రామదేవతలైన పోచమ్మ, మైసమ్మలను భక్తిభావంతో పూజించాలని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోచమ్మ, మైసమ్మ, ఈదమ్మ,పెద్దమ్మ, బీరప్ప, మాడేలు స్వామివార్ల ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. అలాగే, ఆలయాల వద్ద బోనాల ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీలకతీతంగా, బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరపాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల ఉత్సవాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం, పోచమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులకు రూ.80 వేలు విరాళం శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, వెంకటేశ్, రాములు, శేఖర్‌రెడ్డి, భానుకిరణ్, శంకరయ్య, శ్రీశైలం ఉన్నారు.


విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

షార్ట్ సర్క్యూట్.. ఇల్లు దగ్ధం

మంచాల: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని కొర్రం తండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. కొర్రం తండాకు చెందిన కొర్ర అభిలాష్ ఇంట్లో ఆదివారం ఉదయం అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ ఇంటిలోని వస్తువులు, ఆహారధాన్యం పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.2లక్షల విలువ చేసే వస్తువులు కాలిపోయినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

ఔటర్‌పై వ్యక్తి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటనాకు సంబంధించిన వివరాలు ఆదిబట్ల ఎస్ఐ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. కర్నూల్‌లో నివాసం ఉండే తమిళనాడు కు చెందిన వీ.సుబ్రమణ్యం, రంగనాథం, రాధాకృష్ణ, , తిమ్ములు, ముత్తు మాణిక్యం, రవి ,రమేష్‌బాబు అనే వ్యక్తులు కర్నూల్ నుంచి ఏఎస్‌రావు నగర్‌కు మహేంద్ర జైలో వాహనంలో రిషెప్షన్‌కు బయలుదేరారు. శంషాబాద్ వరకు వచ్చి ఔటర్‌రింగ్‌రోడ్డు ఎక్కారు. రావిర్యాల వద్దకు రాగానే ఎగ్జిట్ 13 వద్ద కారు పంక్చర్ అయ్యింది. టైర్ మార్చడం కోసం రాయి వెతుకుతున్నారు. వీరిలో సుబ్రమణ్యం రాయి కోసం రోడ్డు దాటుతున్నాడు. శంషాబాద్ నుంచి బొంగులూర్ వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గా యపడ్డాడు. వెంటనే సుబ్రమణ్యంను నగరంలోని వనస్థలిపురం ఏరియా అస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి సుబ్రమణ్యం మరణించినట్లు తెలిపారు. సుబ్రమణ్యం మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

కడ్తాల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. వివిద కుల సంఘాల ఆధ్వర్యంలో బీరప్ప, ఈదమ్మ, పెద్దమ్మ, మడేలు బోనాలను నిర్వహించారు. ఆయా దేవాలయాలకు మహిళలు ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు పూజలు జరిపారు.


బోనాలతో మహిళలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

మంత్రి మహేందర్‌రెడ్డి


శంకర్‌పల్లి: హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని భూగర్భవనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని పత్తేపురంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి విజయ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని శంకర్‌పల్లిలో ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. రోగులు నగరానికి వెళ్లకుండా ఇక్కడే వైద్య సేవలు పొందడం అభినందనీయమని కొనియాడారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఆస్పత్రులను నడపాలని సూచించారు. అంతకుముందు శంకర్‌పల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజునాయక్ గృహప్రవేశం పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, గుడిమల్కాపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మన్నగారి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీధర్, మాజీ ఉప సర్పంచ్ సంతోష్‌కుమార్, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, ఆస్పత్రి యజమాని విష్ణు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిలో రాణించాలి

చేవెళ్ల: యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుల్లి మల్లేశ్, దామోదర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సాగర్‌రెడ్డిలు కలిసి ఏర్పాటు చేసిన ఎస్‌వీఆర్ రెడిమిక్స్ ప్లాంట్‌ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి రంగాలపై కూడా దృష్టిసారించాలన్నారు. స్వయం ఉపాధితో ఇతరులకు ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం. మాలతి, సర్పంచ్ బి. శైలజ, సొసైటీ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ వెంకటరంగారెడ్డి, ఎంపీటీసీ వసంతం, రాములు, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, విజయ్‌భాస్కర్ రెడ్డి, నాయకులు మానిక్యరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఆగిరెడ్డి, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఆదివారం కేశంపేట మండలం చౌలపల్లి ఎంపీటీసీ రాజు, సంతాపూర్ ఉపసర్పంచ్ యాలాల యాదయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, యాలాల నర్సింహ్మా, తదితరులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ పనులకు నిధుల మంజూరు

కందుకూరు: మహేశ్వరం ఆర్టీసీ డిపో లోపల సీసీ నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.1.45 కోట్ల నిధుల మంజూరు పత్రాన్ని మంత్రి సబితారెడ్డి ఆర్టీసీ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిపో లోపల సీసీ పనుల కోసం అవసరమైన నిధుల ఇవ్వాలని గతంలో డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ద్వారా ఆర్టీసీ చైర్మన్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. అందులో భాగంగానే నిధులు మంజూరయ్యాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు మోతీలాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, ఆర్టీసీ సిబ్బంది శంకర్‌నాయక్, అక్తర్‌పాషా, జితేందర్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.


నిధుల మంజూరు పత్రం అందుకుంటున్న అధికారులు

గుర్తుతెలియని మహిళ మృతదేహం కలకలం


మహిళను హత్యచేసి పాతిపెట్టిన స్థలం

చేవెళ్ల: ఓ ఫామ్‌హౌస్‌లో గుర్తు తెలియని మహిళ శవాన్ని పాతిపెట్టిన విషయం ఆదివారం చేవెళ్లలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలకేంద్రంలోని కనకమామిడి మల్లారెడ్డి అనే రైతు ఫామ్‌హౌస్‌లో సత్తయ్య, కల్పన అనే ఇద్దరు భార్యాభర్తలు కూలీలుగా పనిచేస్తున్నారు. ఈనెల 7న సత్తయ్య, కల్పనలు ఓ మహిళ, మరో వ్యక్తిని ఫామ్‌హౌస్‌కు తీసుకువచ్చారు. వారు తమ అన్నావదినలుగా యాజమానికి పరిచయం చేశారు. శుక్రవారం సత్తయ్య, కల్పనలు తమ ఇంటి వద్ద గొడవలు జరుగుతున్నాయని ఇంటికి వెళ్తున్నామని మల్లారెడ్డికి చెప్పి వెళ్లారు. దీంతో ఆయన నిన్న వచ్చిన మీ అన్నావదినలు ఎక్కడని అడగ్గా వాళ్లు నిన్ననే వెళ్లిపోయారని చెప్పారు. ఆదివారం పొలం వద్ద పైపులైన్ పగిలిపోవటంతో సరిచేసేందుకు మల్లారెడ్డితో పాటు మరో వ్యక్తి వెంకట్‌రెడ్డి, డ్రైవర్ శేఖర్‌లు వెళ్లారు. దీంతో సామగ్రిని తీసుకువచ్చి గది పక్కనే ఉన్న గేట్ వాల్‌ను బంద్ చేసేందుకు వెళ్లారు. అక్కడే మహిళ శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు శవాన్ని బయటకు తీసి తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐలతో శవ పంచనామా చేయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బాసు మృతదేహం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ సమీపంలోని ముర్తుజపల్లి గేటు వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రాయణపల్లి తండాకు చెందిన జటావత్ బాసు(45) మృతి చెందాడు. జటావత్ బాసు రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే, మరో ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి బైక్‌పై వస్తున్న అనిల్‌కుమార్ స్థానిక సూర్యలక్ష్మి కాటన్ మిల్లు వద్ద కార్మికుడిగా పనిచేస్తున్న అప్పల నాయుడును ఢీకొట్టడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఇద్దరిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

బీజేపీ రాష్ట్ర నాయకుడు
పల్లె ఆనంద్ కుమార్

కేశంపేట: ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇస్తే షాద్‌నగర్‌లో గెలుస్తానని బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పార్టీ సూచించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల మోర్చా అధ్యక్షుడు యుగంధర్ కూడా ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.


ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆనంద్‌కుమార్

స్థానికులకే ఇళ్లు కేటాయించాలి


ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని ఆదివారం మంఖాల్ డబుల్ బెడ్రూం సాధన సమితి జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంఖాల్‌లో నిర్మించిన 2800 ఇళ్లను పూర్తిగా స్థానికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడి రైతుల భూముల్లో నిర్మించి వారికి ఇవ్వకపోవడం అన్యాయమని ఆరోపించారు. సాధన సమితి సభ్యులకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, జేఏసీ సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు

యాచారం: వినాయక చవితి వేడుకను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు పేర్కొన్నారు. నక్కర్త మేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వివిధ రాజకీయ పక్షాలు, మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వినాయక నవరాత్రులు పండుగను ప్రశాంతంగా జరుపుకొని నిమజ్జనం పూర్తి చూసుకోవాలని తెలిపారు. తాడిపర్తి బందం చెరువు, కుర్మిద్ద పెద్ద చెరువు, మీరాఖాన్‌పేట చెరువు, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల్లో ఉన్న చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లు చేయడానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ రామాంజనేయులు